

# విపర్యయం

'ఇది నా పెళ్ళి కార్డు.' ఇచ్చాడు యోగి. 'ఇది నీ చావు' నిద్రమాత్రలు. పొట్లం ఇచ్చాడు. తీసుకొంది సునీత.' ఇక నీయిష్టం'. లేచాడు. 'వస్తే నీ పెళ్ళికి రావాలి. లేకపోతే నేను చావాలి. అంతేనా?' అడిగింది.

'కరెక్ట్! లేచాడు. ''ఏ మాటా చెప్పు' యోగి వెళ్ళిపోయాడు. కార్డు ఊహించినట్టుగానే ఉంది. పొట్లంలో డజను మాత్రలున్నాయి.

తెచ్చుకొన్న కాఫీ అలాగ్గే ఉంది. వెతుక్కొంటూవచ్చిన వాడు వెళ్ళిపోయాడు.

తానేమాటా యోగితో చెప్పదు. చెప్పటానికి తానుండదు. అతను వచ్చే సరికి తన శవం ఉంటుంది.

తాను పబ్లిక్‌గా చావాలి. తాము మామూలుగా కూర్చునే కార్నర్‌లో ఈ టేబుల్‌మీద, ఈ కుర్చీలో, ఒక గంట లోపల శవంతాను.

యోగి పెళ్ళికి తాను వెళ్ళకూడదు. వెళ్ళలేదు. కాఫీతో నిద్రమాత్రలన్నీ మింగాలనుకొంది. కాఫీ చల్లారిపోయింది. పొట్లం విప్పలేదు. కాఫీ తాగలేదు. అది మరీ చల్లబడిపోతూ ఉంది.

'యోగి రాలేదా?' ఎవరో అడిగారు. వచ్చిపోయాడు చెప్పింది.పెళ్ళట అంటేట అంది.

సునీత, యోగి ఫ్రెండ్స్ అనీ, ప్రేమికులనీ పెళ్ళి చేసుకుంటారనీ యూనివర్శిటీలో తెలియనివాళ్ళు లేరు. ఇది మోసం కదా! అవునో కాదో సునీతకు తెలియదు. కళ్ళలో నీళ్లింకిపోయాయి.

ఎంతో అందగత్తె అనీ చెప్పాడు. కట్నం కానుకల గొప్పా చెప్పాడు.

తాను వినలేకపోయింది. నేను బతకలేనంది. చనిపోతానంది.

చావమన్నాడు. నవ్వాడు. తాను ఏడ్చింది. ఆరోజు పోయాడు. ఈరోజు వచ్చాడు.

సునీత ఈనెలంతా ఏడ్చింది. కళ్లలో నీళ్ళన్నీవృథాగా ఖర్చయిపోయాయి. చూచేవాళ్ళు లేరు. తుడిచేవాళ్ళు లేరు.సాధించింది లేదు. సునీత మనిషి మనిషిగా లేదు.

అమృతంలాంటి కన్నీరు అక్రమంగా కంటిలో పట్టుతప్పిపడి చెక్కిలి మీదికి బదిలీ అయింది. అది మళ్ళీ పుట్టినూరు చేరలేదు. తానూ స్వగ్రామం పోలేదు. ఉన్నచోటే ఉండలేదు. పరిశోధన సాగించలేదు.

స్వస్థలమంటే భయం. యూనివర్శిటీ అంటేఅసహ్యం. యోగి అంటే రోత. తన మీద తనకు కంపరం. బతకాలని లేదు.

నెలంతా ఎలా గడిచిందో తెలియదు.

సునీత స్కాలర్. పిహెచ్.డి. చేస్తూ ఉంది. మేథ్స్ డిపార్ట్‌మెంట్, యం.యస్సీలో యూనివర్శిటీ రెండు రేక్సు బద్దలు కొట్టింది. మూడు గోల్డు మెడల్స్ సాధించింది. యు.జి.సి. నెట్‌లో క్వాలిఫై అయింది. నూటికి ఒకరో ఇద్దరూ క్వాలిఫై అయ్యే పరీక్ష. ఇవాళ జె.ఆర్.ఎఫ్ వస్తుంది. రేపు లెక్చరరు అవుతుంది. వర్తమానం బాగా ఉంది. భవిష్యత్తు దివ్యంగా ఉంటుంది. అయినా డిపార్ట్‌మెంట్‌కు పోబుద్ధి పుట్టడం లేదు. అసలు యూనివర్శిటీలోనే ఉండాలనిపించడం లేదు.

పల్లెకు పోలేదు. తల్లి తన చిన్నతనంలోనే చనిపోయింది. తండ్రి మళ్ళీ పెళ్లి చేసుకొన్నాడు. సవత్తల్లి తల్లికాదు. ఇంటి నిండా సంతానం. మనుష్యులనిండా ఆకలి. దారిద్ర్యం. తనను అవ్వ సాకింది. చదివించింది. ఇప్పుడవ్వలేదు. పల్లెలో తనకెవరూ లేరు. తండ్రి ఉన్నా లేనట్లే.

ఎవణ్నో ప్రేమించిందట, పెళ్ళాడుతుందట, ఉద్యోగం వెలగబెడుతుందట. పట్నంలోనే ఉంటుందట. పల్లెకు రాదట, అని చాలా 'టా'లు పల్లెలో టాంటాం అయ్యాయి.

ఈ పరిస్థితుల్లో చితికిన గుండెతో సునీత పల్లెకు పోలేదు.ఉండలేదు. ఉండే చోటులేదు. ఆదరించేవాళ్ళు లేరు. కన్నీరు తుడిచేవాళ్ళు లేరు. ఆకలి,దారిద్ర్యం, కన్నీరు అంతే.తన వారసత్వం.

